క్లుప్తంగా

గృహసారథుల సమావేశం నేడు


కోన రామారావు

పరవాడ: వెన్నలపాలెం కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నియోజకవర్గ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరవుతారని చెప్పారు. మండలంలో పార్టీ శ్రేణులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

నాయుడుపాలెంలో గడపగడపకు..

సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నాయుడుపాలెంలో నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నారు. కార్యక్రమంలో మండలంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రామారావు కోరారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


పతకాలు సాధించిన విద్యార్థులతో రిఫరీలు

పరవాడ: విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన 6వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో దీపాంజలినగర్‌కు చెందిన 9 మంది విద్యార్థులు కాటా, కుమిటి రెండు విభాగాల్లో పాల్గొన్నారు. గొర్లి వంశీ, ఎం.కుష్వంత్‌లు బంగారు పతకాలు, సిల్వర్ మెడల్ సాధించారు. సాహు ఎస్. ఎం.ఖ్యాతినాథ్ బ్రాంజ్ మెడల్స్, వి.శ్రీహర్ష బంగారు పతకం, ఎ.ఎస్.ఎ కార్తీకేయ బ్రాంజ్ మెడల్ సాధించారని రిఫరీలు గొర్లె పుష్పారావు, ఎం.తులసీరావు చెప్పారు.

భారీ అన్నసమారాధన


వడ్డన చేస్తున్న శరగడం చిన అప్పలనాయుడు

సింహాచలం: జీవీఎంసీ 96వవార్డు రాజుచెరువు ప్రాంతంలోని శ్రీ భూలోకమాంబ తీర్థమహోత్సవం పురస్కరించుకుని ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో శరగడం అప్పారావు, పెతకంశెట్టి సంజీవి, శరగడం రామకృష్ణ, పెతకంశెట్టి మహలక్ష్మినాయుడు, శరగడం శ్రీను, ఆళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం


సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఆదివారం నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన ఇమంది లక్ష్మీప్రసాద్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని ఆలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు నగదురూపంలో అందజేశారు. దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

పరవాడ: జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. పరవాడలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని ఆదివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఇళ్ల నిర్మాణాలకు సరిపోక లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. నిధులు పెంచడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిల్లులు కూడా వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు

- ముత్యాలమ్మపాలెం తీరంలో ఆధ్యాత్మిక సందడి
- పరమశివుడికి విశేష పూజలు


శివుడికి పూజలు చేస్తున్న భక్తులు


ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పరవాడ: మాఘపౌర్ణమి పురస్కరించుకొని ముత్యాలమ్మపాలెం తీరానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలోని శ్రీ మాధవస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాధవస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మత్స్యకారులకు మాధవస్వామి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, నాయకులు వి.సన్యాసిరావు, బురదరాజు ఉన్నారు.

పక్కాగా ఏర్పాట్లు : తీర్థ మహోత్సవంలో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ పి.ఈశ్వరరావు పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. గ్రామ సచివాలయం నుంచి తీరానికి చేరుకోవడానికి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పాటు చేసిన రహదారి భక్తుల పాలిట వరంగా మారింది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు. దూర ప్రాంతాల నుంచి పుణ్యస్నానాల ఆచరించేందుకు వచ్చే భక్తుల కోసం స్టీల్‌సిటీ డిపో నుంచి 10 ఆర్టీసీ బస్సులు నడిపారు. శనివారం రాత్రి జాగరణలో పాల్గొన్న భక్తుల కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు తీరంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు తాగు నీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం, ఉచిత భోజన సౌకర్యాలు కల్పించారు. అమ్మాభగవాన్ భక్తులు తీరంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరంలో ఆదిలక్ష్మి, ప్రభాకరమూర్తి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓంశాంతి రాజయోగిని ఉచిత గీతా పాఠశాల నిర్వహించి భక్తులకు శివుని గొప్పతనాన్ని వివరించారు.


శ్రీ మాధవస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

వైభవంగా మహా మాఘీ ఉత్సవాలు


ఖడ్గమాల దేవతలను అభిషేకించేందుకు కలశాలతో పవిత్ర జలాలు తీసుకువెళ్తున్న భక్తులు


పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మహా మాఘీ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా దక్షవాటిలో చండీ పారాయణ, సహస్ర చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పవిత్రీకరించిన 116 కలశాల్లోని పవిత్ర జలాలను ఆహుతులైన భక్తులంతా దేవీపురంలో శ్రీయంత్ర మహామేరు నిలయంలోని 108 ఖడ్గమాల దేవతలకు అభిషేకించారు. అదేవిధంగా పౌర్ణమి సందర్భంగా సహస్రాక్షి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకూ నిర్వహించిన పూర్ణాభిషేకంలో అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు. అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మతో పాటు గురూజీ చైతన్యానంద సరస్వతి ఆశీర్వాదం పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు కెనడాకు చెందిన రమేష్ నటరాజన్ సంతోషం వ్యక్తం చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఏడీసీ రామచంద్రమోహన్


ఆశీర్వచనం స్వీకరిస్తున్న రామచంద్రమోహన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో నరసింహరాజు ఆయనకు అందజేశారు.

గ్రామాల్లో పరసల సందడి

సబ్బవరం: మండలంలోని మొగలిపురం,అసకపల్లి శివారు సున్నంబట్టీల్లో కొలువైన అమ్మవార్ల తీర్థమహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొగలిపురంలో బండిమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే అసకపల్లి శివారు సున్నంబట్టీల్లో కొలువైన శ్రీపలసమ్మ తీర్థం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సూర్య భగవానుడికి విశేషంగా పూజలు


గోశాలలో సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


సుజాతానగర్‌లో పూజలందుకున్న స్వామి

సింహాచలం: మాఘ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో కొలువైన సూర్యభగవానుడి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. గోశాలలో ఉన్న 12 అడుగుల సప్త అశ్వ వాహన సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ నెలకుంది. స్వామి ని దర్శించుకుని సూర్య నమస్కారాలు చేశారు.

సుజాతానగర్‌లో.. : సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. సహస్రనామార్చన అనంతరం సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు స్వయంగా వండిన ప్రసాదాన్ని స్వామికి నివేదించారు.

భక్తిశ్రద్ధలతో రాజగోపురాల ప్రతిష్ట


రాజగోపురాలపై కలశ ప్రతిష్ట చేస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: చినముషిడివాడలోని అలివేలు మంగమ్మ ఆలయంలో కొత్తగా నిర్మించిన తూర్పు, ఉత్తర రాజగోపుర రాజగోపురాల ప్రతిష్ట ఆదివా రం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి యాగశాలార్చన, విశేష హోమాలు, మహాపూర్ణాహుతి, రాజగోపురాలపై కలశ ప్రతిష్ట, కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు రామనుజమ్ తదితరులు పూజలను నిర్వహించారు.

రేపు చినయాతపాలెం వీరాంజనేయ తీర్థం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలో మంగళవారం శ్రీవీరాంజనేయ తీర్థాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దురుగునాయుడు తెలిపారు. ఎడ్ల పందాల్లో విజేతలుగా నిలిచిన బళ్లకు వరసగా రూ.8 వేలు రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. కోలాటం కార్యక్రమంతో పాటు ముగ్గుల పోటీలు, సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 32 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1990–91వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు చదువుకున్న పాఠశాలలోనే కలుసుకొని తమ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలను తెలుసుకున్న అనంతరం ఆట, పాటలతో గడిపారు. అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు రామలింగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. స్నేహితుల సహాయ నిధిని సమకూర్చి తమతో చదువుకున్నవారిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్‌ను తెరిచి అందులో ప్రతినెలా కొంత చొప్పున డిపాజిట్ చేయాలని తీర్మానించుకొన్నారు. ఈ నిధికి తన తరపున లక్షా నూట పదహారు రూపాయలను ఇస్తున్నట్టు పూర్వ విద్యార్థి కరణంరెడ్డి నర్సింగరావు ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అనిల్ జోసెప్, నూకరాజు, చట్టి గోపి, జయరామ్, నీలం మూర్తి, బాలాకుమార్, విజయ్‌కుమార్, జబ్బార్, మైమున్నీషా బేగం, శైలజానాయుడు, వర్మ, నర్సింగరావు, రామ్ ప్రసాద్, మోహన్ కృష్ణ, లక్ష్మి, పద్మావతి, జయలక్ష్మి, సుధీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్–2 ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

ఘనంగా చక్రస్నానం


వెంకన్న ఉత్సవమూర్తులు, చక్రపెరుమాళ్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న భీష్మ ఏకాదశి వార్షిక కల్యాణమహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం స్వామికి అభిషేకం, చక్రస్నానం విశేషంగా నిర్వహించారు. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం చక్రపెరుమాళ్లకు చక్రస్నానం చేసి ఆజలాలు భక్తులపై పడేలా విశేషంగా ఏర్పాట్లు చేశారు. అలాగే సాయంత్రం స్వామికి గ్రామ తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దారిపొడవునా గ్రామస్తులు స్వామికి హారతులిచ్చారు. అర్చకులు శ్రీకాంత్, భార్గవ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకగా అప్పన్న నిత్యకల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పవన్, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

స్పృహ తప్పిన వృద్ధుడికి సపర్యలు


వృద్ధుడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

అల్లిపురం: బస్టాప్‌లో స్పృహ తప్పిపోయిన వృద్ధుడికి మహారాణిపేట పోలీసులు చికిత్స అందించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. సబ్బవరానికి చెందిన దివిలి శివరామ్(75) ఆదివారం సాయంత్రం జగదాంబ బస్టాప్ వద్ద స్పృహ తప్పి పడి ఉన్నాడు. అతన్ని మహారాణిపేట హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గుర్తించి.. విషయాన్ని సీఐ రమణమూర్తి తెలియజేశారు. అతని ఆదేశాల మేరకు కేజీహెచ్‌కు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. అతని బ్యాగులో ఉన్న చిరునామా ప్రకారం సబ్బవరంలోని ఓ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతని కుమారుడు ఉమాపతికి సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులకు వృద్ధుడిని అప్పగించారు.

సీనియర్ సిటజన్స్‌కు సత్కారం


సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని సీనియర్ సిటిజన్లు మంగిపూడి సత్య జగన్నాథరావు, శ్రీపాదం ఆనందరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.సన్యాసిరావు, కార్యదర్శి జి.నరేంద్ర, కోశాధికారి వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సింహాచలం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)పెందుర్తి ఏరియా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం సుజాతనగర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగింది. అధ్యక్షుడిగా ఆర్.పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.సురేష్, వై.సాయి, కార్యదర్శిగా ఎస్.లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఎ.దుర్గాప్రసాద్, సుబ్బు, కోశాధికారిగా ఎం.రాజు, మరో ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా ఏఐవైఎఫ్ కన్వీనర్ వై.రాంబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉక్కు పోరు ఆపేదే లేదు


724వ రోజు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికుల ఉద్యమానికి విలువనిచ్చి ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు పోరాటాన్ని విరమించేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 724వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు మరియు సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారని, ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సేవ్ పబ్లిక్ సెక్టార్– సేవ్ ఇండియా పేరుతో అన్ని పరిశ్రమల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉక్కు ఉద్యమానికి 700 రోజులు గడిచినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తోందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.